# భద్రాద్రి రాముడికి గోటితో ఒలిచిన తలంబ్రాలు

మెట్‌పల్లి మారుతీనగర్, జనవరి 11: భద్రాచలం రాములోరి కల్యాణానికి ఏటా మెట్‌పల్లికి చెందిన మహిళలు వడ్లను గోటితో ఒలిచిన బియ్యాన్ని సిద్ధం చేయడం ఆనవాయితీ. ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ గురువారం పట్టణంలోని బాలకృష్ణనగర్‌లోని మహిళలు వడ్లను చేతితో ఒలుస్తూ కనిపించారు. ఈ నెల 15న తలంబ్రాలను భద్రాచలానికి పంపిస్తామని వారు చెప్పారు.


వడ్లను గోటితో ఒలుస్తున్న మహిళలు

# నేడు పందెం కోడికి వేలం

## ప్రకటించిన కరీంనగర్ ఆర్టీసీ అధికారులు

కరీంనగర్ తెలంగాణచౌక్, జనవరి 11 : రెండు రోజుల క్రితం ఆర్టీసీ బస్సులో దొరికిన పందెం కోడికి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు డిపో -2 ఆవరణలో వేలం పాట నిర్వహించనున్నారు. నిబంధనల ప్రకారం బస్సులో మరిచిపోయిన వస్తువుల కోసం సరైన ఆధారాలతో ఎవరూ రాకుంటే 24 గంటల తర్వాత లాస్ ఆఫ్ ప్రాపర్టీ కింద వేలం వేస్తారని కరీంనగర్ డిపో-2 మేనేజర్ మల్లయ్య తెలిపారు. ఇప్పటి వరకు పందెం కోడి కోసం ఎవరూ రాలేదని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేలం వేస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని, నగదును ట్రెజరీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలో జమ చేస్తామని చెప్పారు.


కరీంనగర్‌లోని ఆర్టీసీ డిపో-2 ఆవరణలో సెక్యూరిటీ గార్డుల పర్యవేక్షణలో పందెం కోడి


కరీంనగర్ రూరల్: బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్‌లో సంక్రాంతి సంబురాల్లో సిబ్బంది

## ముందస్తు సంక్రాంతి



ఉమ్మడి జిల్లాలో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్యంగా పాఠశాలల్లో కనుల పండువలా చేసుకున్నారు. గంగిరెద్దుల ప్రదర్శనలు, హరిదాసుల కీర్తనలు, విద్యార్థుల వేషధారణల మధ్యన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా జరిపారు.

*- కరీంనగర్ కమాన్ చౌరస్తా, జనవరి 11*


000000

## సెలవులతో రద్దీ

విద్యా సంస్థలకు ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు సంక్రాంతి సెలవులను ప్రకటించారు. దీంతో హాస్టల్ విద్యార్థులు శుక్రవారం సాయంత్రం నుంచి ఇంటిబాట పట్టారు. మరోవైపు వరుస సెలవులతో ప్రజలు కూడా స్వగ్రామాలకు వెళ్లేందుకు బయలు దేరారు. సాయంత్రం పెద్ద సంఖ్యలో బస్టాండ్లకు చేరుకున్నారు. దీంతో జిల్లా కేంద్రాల్లోని బస్టాండ్లు రద్దీగా మారాయి. ఎక్కడ చూసినా కిక్కిరిసిపోయి కనిపించాయి. ప్రధానంగా ఉమ్మడి జిల్లాకేంద్రంలోని కరీంనగర్ బస్‌స్టేషన్ అయితే వేలాది మందితో కిటకిటలాడింది. సరిపడా బస్సులు లేక గంటల కొద్ది ఎదురుచూడాల్సి వచ్చింది.

*- కరీంనగర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్*

• నేడు అలిశెట్టి జయంతి, వర్ధంతి


పురస్కార గ్రహీతలతో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

# మినీ కవిత్వ సూర్యుడు అలిశెట్టి

## జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల, జనవరి 11 : తన చిన్న కవితలతో మెరిపించి, సమాజ చైతన్యం కోసం పాటుపడిన అలిశెట్టి ప్రభాకర్ మినీ కవిత్వ సూర్యుడని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రశంసించారు. శుక్రవారం అక్షర సూర్యుడు అలిశెట్టి జయంతి, వర్ధంతిని పురస్కరించుకొని గురువారం జగిత్యాలలోని శివసాయి రెసిడెన్సీలో కళాశ్రీ సాహితీ వేదిక అధినేత గుండేటి రాజు ఆధ్వర్యంలో అలిశెట్టి పురస్కారాల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనికి జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతతో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. జంగం స్వయం ప్రభ, సిరిపురం వాణిశ్రీ, డాక్టర్ తిరునగరి శరత్ చంద్ర, డాక్టర్ పగిడిపెల్లి సురేందర్‌కు పురస్కారాలను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. తెలుగు సాహితీలోకం మర్చిపోలేని కవి అలిశెట్టి అని అభివర్ణించారు. అలతి పదాలతో అనంత అర్థాలు చెప్పి అనల్పమైన వాక్యాలతో శబ్ద శక్తిని, తన చిత్రాలతో మహా ఇతివృత్త శక్తిని అందించారని గుర్తు చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, అక్షరాన్ని ఆయుధం చేసి తన కవిత్వాన్ని ప్రాణ వాయువుగా మార్చి నింపాలని అలిశెట్టి తపించారని తెలిపారు. తెలంగాణ అలిశెట్టి కవి సమ్మేళనంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అలిశెట్టి తనయుడు సంగ్రామ్, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, అలిశెట్టి మాధవి రాజు, ఉజగిరి జమున, మద్దెల సరోజన, అయిత అనిత, మోటూరి శ్రీనివాస్, చెట్ల చంద్రశేఖర్, బుర్ర శ్యామలగౌడ్, లక్కరాజు శ్రీలక్ష్మి, పసుల రవికుమార్, గుండేటి బేబిరాణి, సంకోజి రాధ శివ కుమార్ పాల్గొన్నారు.

## బీసీ గురుకులాల్లో ప్రవేశానికి

# దరఖాస్తుల ఆహ్వానం

పెగడపల్లి, జనవరి 11 : ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా మహాత్మా జ్యోతీబాపూలే బీసీ గురుకుల పాఠశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల విద్యాలయాల సంస్థ ప్రాంతీయ కన్వీనర్ ఎం గౌతమ్‌కుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15 బాలికలు, 15 బాలురు కలిపి 30 పాఠశాలలు ఉన్నాయని, అందులో 6, 7, 8 తరగతుల్లో ఖాళీలు ఉన్నట్లు వివరించారు. ఫిబ్రవరి 15లోగా రూ.100 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వీరికి మార్చి 3న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు www.mjptbcwreis-telangana.gov.in లేదా www.mjptbcwreis.cgg.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.


నినదిస్తున్న లారీ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు

## 'హిట్ అండ్ రన్' యాక్ట్‌ను

# రద్దు చేయాలి

### కరీంనగర్‌లో లారీ డ్రైవర్ల ఆందోళన

కరీంనగర్ రూరల్: జనవరి 11: హిట్ అండ్ రన్ కేసుల్లో ఏడేండ్ల జైలు శిక్ష, రూ. 10 లక్షల దాకా జరిమానా విధించేలా కేంద్రం తెచ్చిన చట్టంపై లారీ డ్రైవర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన బాట పట్టారు. గురువారం కరీంనగర్ బైపాస్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. లారీలు, టిప్పర్లు, రెడీమిక్స్ కాంక్రీట్ వాహనాలను నిలిపివేసి నిరసనకు దిగారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో చర్చించకుండానే ఈ చట్టానికి ఆమోదముద్ర వేయడం బాధాకరమన్నారు. ఈ చట్టం లారీ డ్రైవర్ల పాలిట ఉరితాడు లాంటిదన్నారు. రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లనే బాధ్యులను చేయడం సరికాదన్నారు. 90 శాతం ప్రమాదాలు మానవేతర కారణాలవల్లే జరుగుతున్నట్లు అనేక అధ్యయనాల్లో తేలిందన్నారు. కానీ కేంద్రం ప్రతిపక్షాల పార్లమెంట్ నుంచి బయటకు గెంటేసి ఈ బిల్లును పాస్ చేయించిందని ఆరోపించారు. ఇప్పటికైనా ఈ యాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేశ్, లారీ డ్రైవర్ల యూనియన్ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే ఆరిఫ్‌మొహినొద్దీన్, శ్రీనివాస చారి, దస్తగిరి, ఎండీ షఫీ, వెంకన్న, భద్రయ్య, సురేందర్, సదానందం, సత్యనారాయణ, హైమత్, రమేశ్ పాల్గొన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షణ్‌లో

# మెరిసిన బల్దియాలు




- కరీంనగర్‌కు రాష్ట్రంలో రెండో స్థానం
- జాతీయ స్థాయిలో 81వ ర్యాంకు
- సిరిసిల్లకు రాష్ట్రస్థాయిలో ఏడో స్థానం

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 11 : స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని బల్దియాలు మరోసారి మెరిశాయి. ముఖ్యంగా కరీంనగర్ మరోసారి సత్తా చాటింది. దేశంలో 446 నగరాలతో పోటీ పడి 6,241 మార్కులతో 81వ ర్యాంకు సాధించింది. రాష్ట్ర స్థాయిలో గ్రేటర్ హైదరాబాద్ మొదటి స్థానంలో ఉండగా, కరీంనగర్ రెండో స్థానంలో నిలిచింది. గతేడాది రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలువగా ఈసారి మరింత మెరుగుపర్చుకున్నది. ఇంటింటా చెత్త సేకరణ, హోం వర్మీ కంపోస్టు, పబ్లిక్ టాయిలెట్స్ క్లీనింగ్, మార్కెట్ క్లీనింగ్, తదితర అంశాల్లో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మున్సిపాలిటీలకు మార్కులు కేటాయించింది. వీటిల్లో చెత్తను వేరు చేయడం, గృహవినియోగ ప్రాంతాలు, మార్కెట్స్ క్లీనింగ్, రిజర్వాయర్ల వద్ద పారిశుధ్యం, పబ్లిక్ టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉంచడంలో కరీంనగర్‌కు వంద శాతం మార్కులు రాగా.. డంప్ యార్డు చెత్తను తగ్గించడంలో కేవలం 5 శాతం మార్కులు మాత్రమే వచ్చాయి. అలాగే, ఇంటింటా చెత్త సేకరణ విషయంలో 45 శాతం, చెత్త రీసైక్లింగ్ విషయంలో 75 శాతం మార్కులు సాధించింది. రామగుండం నగర పాలక సంస్థకు జాతీయ స్థాయిలో 175వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంకు వచ్చింది.

### 50 వేల నుంచి లక్ష లోపు జనాభా మున్సిపాలిటీల్లో

- సిరిసిల్ల జాతీయ స్థాయిలో 231వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంకు, సౌత్ జోన్ స్థాయిలో 4వ ర్యాంకు సాధించింది.
- జగిత్యాలకు జాతీయ స్థాయిలో 860వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 49వ ర్యాంకు, సౌత్ జోన్ స్థాయిలో 28వ ర్యాంకు వచ్చింది.
- కోరుట్ల జాతీయ స్థాయిలో 300వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 12వ ర్యాంకు, సౌత్ జోన్ స్థాయిలో 6వ ర్యాంకు సాధించింది.
- మెట్‌పల్లికి జాతీయ స్థాయిలో 763వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 38వ ర్యాంకు, సౌత్ జోన్ స్థాయిలో 18వ ర్యాంకు వచ్చింది.

✓ 15 వేల లోపు జనాభా కలిగిన మున్సిపాలిటీల్లో కొత్తపల్లి జాతీయ స్థాయిలో 769వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 39వ ర్యాంకు సాధించింది. సౌత్ జోన్‌లో 3వ ర్యాంకు వచ్చింది.

### 15 వేల నుంచి 25 వేల లోపు జనాభా మున్సిపాలిటీల్లో..

- చొప్పదండి జాతీయ స్థాయిలో 1156వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 86వ ర్యాంకు, జోనల్ స్థాయిలో 28వ ర్యాంకు సాధించింది.
- ధర్మపురికి జాతీయ స్థాయిలో 1159వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 87వ ర్యాంకు, సౌత్ జోన్ స్థాయిలో 29వ ర్యాంకు వచ్చింది.
- రాయికల్ జాతీయ స్థాయిలో 858వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 48వ ర్యాంకు, సౌత్ జోన్ స్థాయిలో 14వ ర్యాంకు సాధించింది.
- మంథనికి జాతీయ స్థాయిలో 2678వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 128వ ర్యాంకు, సౌత్ జోన్ స్థాయిలో 165వ ర్యాంకు వచ్చింది.
- సుల్తానాబాద్ జాతీయ స్థాయిలో 3042వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 130వ ర్యాంకు, సౌత్ జోన్ స్థాయిలో 226వ ర్యాంకు సాధించింది.

### 25 వేల నుంచి 50 వేల లోపు జనాభా మున్సిపాలిటీల్లో

- జమ్మికుంట జాతీయ స్థాయిలో 1216వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 92వ ర్యాంకు, సౌత్ జోన్ స్థాయిలో 48వ ర్యాంకు సాధించింది.
- హుజూరాబాద్‌కు జాతీయ స్థాయిలో 639వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 27వ ర్యాంకు, జోనల్ స్థాయిలో 15వ ర్యాంకు వచ్చింది.
- పెద్దపల్లి జాతీయ స్థాయిలో 1173వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 89వ ర్యాంకు, సౌత్ జోన్ స్థాయిలో 44వ ర్యాంకు సాధించింది.
- వేములవాడకు జాతీయ స్థాయిలో 1055వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 74వ ర్యాంకు, సౌత్ జోన్ స్థాయిలో 35వ ర్యాంకు వచ్చింది.

### మంచి ర్యాంకు రావడం గర్వకారణం

స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో కరీంనగర్ నగరపాలక సంస్థకు మెరుగైన ర్యాంకులు, అవార్డులు రావడం గర్వకారణం. గతంతో పోలిస్తే చాలా మెరుగ్గా ఉన్నది. గతేడాది లక్షకుపైగా జనాభా ఉన్న నగరాల



కేటగిరీలో తక్కువ నగరాలతో పోటీ పడి 61 ర్యాంకు సాధించగా, ఈ సారి మరిన్ని ఎక్కువ నగరాలతో పోటీ పడి 81వ ర్యాంకు సాధించడం సంతోషకరం. గతంతో పోలిస్తే ప్రస్తుతం వచ్చిన ర్యాంకు చాలా మెరుగైనది. పాలకవర్గంతో పాటు పారిశుధ్య కార్మికులు, సిబ్బంది, ప్రజల కృషి ఫలితమే ఈ ర్యాంకులు. కేసీఆర్ ప్రభుత్వంలో పరిశుభ్రమైన నగరంగా అభివృద్ధి చెందడంతోనే ఈ ఫలితాలు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ సహకారం మరువలేనిది. ప్రజలు, పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి అభినందనలు.

**- వై సునీల్‌రావు, మేయర్**

# పండుగకు పస్తులేనా..?

- సంక్రాంతి పూట కాంట్రాక్ట్ ఉద్యోగుల వ్యథ
- అమలుకు నోచని కాంగ్రెస్ ఎన్నికల హామీ
- పన్నెండో తేదీ వచ్చినా అందని వేతనాలు
- కరీంనగర్ జిల్లాలో 700 మందికిపైగా ఎదురుచూపులు
- త్వరగా ఇవ్వాలని వేడుకోలు



***సంక్రాంతి పండుగ సమీపిస్తున్నది. కాంగ్రెస్ హామీ ఇచ్చినట్టు ప్రభుత్వోద్యోగులతోపాటే తమకు కూడా వేతనాలు వస్తాయని ఆశించిన కాంట్రాక్ట్ ఉద్యోగులకు నిరాశే మిగిలింది. ఒకటో తారీఖు పోయి పన్నెండో తారీఖు వచ్చినా వేతనాలు పడక ఎదురుచూపులు చూడాల్సి వస్తున్నది. పండుగ వేళ ఇరుగు, పొరుగు కుటుంబాలు పిండి వంటలు చేస్తుంటే తమ కుటుంబాల్లోని పిల్లలు ఆర్తిగా చూసే పరిస్థితి వస్తున్నదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవ చూపాలని, ప్రభుత్వం నుంచి జీతాలు త్వరగా ఇచ్చి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.***

కరీంనగర్ కలెక్టరేట్, జనవరి 11 : కరీంనగర్ జిల్లాలో ప్రధాన ప్రభుత్వ శాఖల్లో ఒప్పంద ప్రాతిపదికన సుమారు 700 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో గ్రామీణ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్‌లో 117 మంది, విద్యాశాఖకు సంబంధించి పలు విభాగాల్లో 555 మంది, ఉన్నత విద్యాశాఖలోనూ అత్యధికంగా పని చేస్తున్నారు. వీరు ఏండ్లకేండ్లుగా ఈ కొలువుల్లో కొనసాగుతున్నారు. పరిమితంగా వచ్చే వేతనాలపైనే ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇన్నాళ్లు జీతాలు వెనుకాముందైనా.. పండుగ సమయాల్లో మాత్రం ముందుగానే వచ్చేవని చెబుతున్నారు. అయితే ఈ సారి మాత్రం పరిస్థితి భిన్నంగా ఉందని వాపోతున్నారు. ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే ప్రతి నెలా ఒకటో తారీఖునే అన్ని శాఖల్లోని ఒప్పంద ఉద్యోగులకు వేతనాలు విడుదల చేస్తామంటూ కాంగ్రెస్ ప్రకటించిందని, కానీ అలా వేతనాలు మాత్రం పడలేదని చెబుతున్నారు. ఒకటో తారీఖు పోయి పన్నెండో తారీఖు వచ్చిందని, సంక్రాంతి పూట ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఉన్నదని, ఈ సారి పండుగకు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ ఇచ్చిన హామీ నిలుపుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.


పెద్దపల్లి మార్కెట్ యార్డులో విక్రయానికి తీసుకొచ్చిన పత్తి బస్తాలు

# తెల్లబోయిన పత్తి రైతు

***పత్తి రైతులకు ఈ యేడాది నిరాశే మిగులుతున్నది. వాతావరణం అనుకూలించక అంతంతే దిగుబడి రాగా, ఆపై ధర లేక పెట్టుబడులు ఎల్లని దుస్థితి ఉన్నది. గతేడాది రికార్డుస్థాయిలో క్వింటాలు ₹10 వేల దాకా పలికి మెరిపించిన కాటన్ ధర, ఈసారి అమాంతం పడిపోయింది. నవంబర్ నుంచి కొనుగోళ్లు జరుగుతుండగా, ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ మాత్రమే ₹7020 మద్దతు ధర చెల్లిస్తున్నది. ప్రైవేట్‌లో అయితే ₹6900 లోపే పలుకుతున్నది. ఈసారి అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తికి డిమాండ్ లేకపోవడంతోనే ధరలు తగ్గగా, తాము తీవ్రంగా నష్టపోతున్నామని కర్షకలోకం వాపోతున్నది.***

- ఈసారి తగ్గిన దిగుబడులు
- పడిపోతున్న కాటన్ రేటు
- సీసీఐ మద్దతు ధర క్వింటాల్‌కు ₹7,020లే
- కొర్రీలతో ప్రైవేట్ వైపు రైతులు
- ₹6,400 నుంచే మొదలు
- అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడమే కారణం
- పెట్టుబడులూ కష్టమేనంటున్న కర్షకులు



### రేట్లు పడిపోతయని అనుకోలె

ఈ యేడాది పత్తికి రేటే లేదు. ఇట్ల పడిపోతయని అనుకోలె. గతేడాది ₹10 వేల దాకా పోయింది. చాలా లాభమైంది. ఈసారైతే ₹7 వేలు దాటుతలేదు. ఇంకా అందులో తేమ అంటూ కోత పెడుతున్నరు. నిన్న ₹6,700. ఇయ్యాళ కూడా గంతే. ఇంకా రాను రాను ఇంకా తగ్గేటట్టే ఉన్నది. మాకేం మిగులుతయి. ఒక్క యూరియా బస్త కూడా ఉద్దెర ఇస్తలేరు. కైకిలి ఒక్కళ్లకు ₹300 అయింది.

**- రాథ్లీ, రైతు, బసంత్‌నగర్ (పాలకుర్తి మండలం)**

పెద్దపల్లి, జనవరి 11 (నమస్తే తెలంగాణ): గతేడాది పత్తి రైతు పంట పండింది. కాసుల వర్షం కురిసింది. ప్రైవేట్ వ్యాపారులు సీసీఐ మద్దతు ధరను మించి పోటీపడి మరీ కొనుగోలు చేయడం కనిపించింది. క్వింటాల్ ధర ₹10 వేల దాకా పలికింది. ఈ క్రమంలో ఈసారి కూడా అదే రేటు వస్తుందని రైతులు ఆశపడ్డారు. కరీంనగర్ జిల్లాలో 34,273 మంది రైతులు 45,843 ఎకరాలు.. జగిత్యాల జిల్లాలో 15,456 మంది రైతులు 20,250 ఎకరాలు.. పెద్దపల్లి జిల్లాలో 44,331 మంది రైతులు 57,600 ఎకరాలు.. సిరిసిల్ల జిల్లాలో 33,748 మంది రైతులు 54,489 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. దిగుబడి కూడా బాగానే వస్తుందని అధికారులు అంచనా వేశారు. కానీ, ఈ యేడు వర్షాలతో పంట దెబ్బతిన్నది. దిగుబడి తగ్గిపోయింది. సాధారణంగా ఎకరానికి 12 నుంచి 15 క్వింటాళ్లు రావాల్సి ఉన్నా.. ఎక్కడ కూడా 10 క్వింటాళ్లు దాటడం లేదని రైతులు చెబుతున్నారు. చాలా చోట్ల 8 క్వింటాళ్లకు మించి రావడం లేదని వాపోతున్నారు.

### ధర అంతంతే..

గతేడాది పత్తి మంచి లాభాలను అందించింది. అప్పుడు గరిష్ఠంగా క్వింటాలు ధర ప్రైవేట్‌లో ₹10 వేలు పలుకగా, కనిష్ఠంగా ₹7,500 దాకా వచ్చింది. అయితే ఈసారి అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తికి డిమాండ్ లేకపోవడంతో ధర పడిపోతున్నది. గత నవంబర్ నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభం కాగా, ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ క్వింటాల్‌కు మద్దతు ధర ₹7,020 చెల్లిస్తున్నది. పొడవు పింజ రకం పత్తి తేమ 8 శాతం ఉంటేనే ₹7,020 మద్దతు ధర ఇస్తున్నది. 8 నుంచి 12 మధ్యలో తేమ శాతం ఉంటే ఒక్కో శాతానికి క్వింటాల్‌కు ₹70.20 పైసలు తగ్గిస్తూ కొనుగోలు చేస్తున్నది. సీసీఐ తేమ పేరిట రేట్ తగ్గిస్తుండడం, డబ్బుల చెల్లింపులోనూ కొంత ఆలస్యం చేస్తుండడంతో రైతులు ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా పలువురు వ్యాపారులు ధరను మరింత తగ్గిస్తున్నారు. గతేడాది పోటీ పడి కొన్నా.. ఈసారి మొదట ₹6,700కు కొన్నారు. తర్వాత ₹6900 వరకు పెరిగినా.. అక్కడక్కడా ₹6,400 వరకే చెల్లిస్తున్నారు. దీంతో తాము నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, పెద్దపల్లి జిల్లాలో ఇప్పటివరకు ప్రైవేటు ద్వారా మార్కెట్ యార్డులో 20,150 క్వింటాళ్లు, జిన్నింగ్ మిల్లుల ద్వారా 22,800 క్వింటాళ్లు, సీసీఐ ద్వారా 43,120 క్వింటాళ్ల కొనుగోళ్లు చేశారు.

### అన్ని ఏర్పాట్లు చేశాం

జిల్లాలో పత్తి కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేశాం. రైతులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. పెద్దపల్లి జిల్లాలో ప్రైవేటు వ్యాపారులు కొనుగోళ్లను ప్రారంభించారు. మార్కెట్ రేటును బట్టి రోజుకో రకంగా కొంటున్నారు. సీసీఐ ప్రభుత్వ మద్దతు ధర ₹7,020గా ప్రకటించింది. అయితే రైతులు పలు కారణాలతో ప్రైవేటుగా విక్రయించేందుకే ఆసక్తిని చూపుతున్నారు.

**-ప్రవీణ్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి (పెద్దపల్లి)**



### దిగుబడి లేదు.. ధర లేదు

ఈ యేడాది దిగుబడి లేదు. ధర లేదు. రైతులకు చానా నష్టం. నేను నాలుగెకరాల్లో పత్తి సాగు చేసిన. ఎకరానికి 15 క్వింటాళ్లు రావాలి. కానీ, 10 క్వింటాళ్ల దాకా కూడా వచ్చేటట్టు లేదు. ఇప్పటిదాకా 12 క్వింటాళ్లు అమ్మిన. పంటకు వైరస్ అచ్చింది. వర్షానికి ఆకు జాడిచ్చింది. నీళ్లు కట్టినంక మాడిపోయింది. దాంతోటి దిగుబడి తగ్గింది. పోయినసారి క్వింటాల్‌కు ₹9 వేల దాకా రేటు వచ్చింది. ఈసారి ₹6500 వచ్చుడే కష్టమున్నది.

**- జీ హన్మంతు, రైతు, చిన్నకల్వల (పెద్దపల్లి మండలం)**